అమృత భాండం.. కొబ్బరి బొండాం

- శరీరానికి శక్తినిచ్చే సహజ సిలైన్
- వేసవి తాపానికి విరుగుడు


అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కొబ్బరి బొండాలు

అంబాజీపేట: అమృతం రుచి ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు కానీ ఏదైనా మధుర పదార్థం తిన్నప్పుడు, పానీయం తాగినప్పుడు అమృతంలా ఉందనడం పరిపాటి. అలనాడు క్షీర సాగర మథనంలో వెలువడిన అమృతభాండాన్ని విష్ణువు మోహిని అవతారంలో దేవతలకు పంచినట్లు కలియుగంలో కొబ్బరిబొండం రూపంలో అమృతాన్ని మానవాళికి పంచాడని చెప్పుకోవచ్చు. సహజ సిద్ధమైన సిలైన్‌లా పనిచేస్తూ ఎంతో ఆరోగ్యానివ్వడమే కాకుండా వేసవి తాపాన్ని తీరుస్తుంది. ఏడాది పొడవునా కొబ్బరి బొండాలు లభిస్తున్నప్పటికీ వేసవిలోనే కొబ్బరి బొండాలకు ఎంతో డిమాండ్ లభిస్తుంది. సామాన్య మానవుడు సైతం కొబ్బరి బొండం ప్రాముఖ్యత తెలుసుకొని, ఆపై వైద్యుల సూచనల మేరకు బొండాన్ని వినియోగించడంతో రోజురోజుకు కొబ్బరి బొండాల వినియోగం పెరుగుతోంది.

కొబ్బరి బొండాల్లో రకాలు

కొబ్బరి బొండాల్లో చాలా రకాలున్నప్పటికీ గంగా బొండం, గోదావరి గంగ, ఈస్ట్ కోస్ట్ టాల్, మలయన్ డ్వార్ఫ్ ఆరెంజ్, ఎల్లో తదితర రకాలున్నప్పటికీ ఎక్కువగా గంగా బొండం, గోదావరి గంగ రకాల బొండాల నీరు ఎంతో అమృతంలా ఉంటాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఒక్కో బొండంలో సుమారు 250 మిల్లీ లీటర్ల నుండి 300 మిల్లీ లీటర్ల నీరు ఉంటుంది. బొండం లోపల కొబ్బరి ముక్క గోటిమీగడ దశలో ఉన్నప్పుడు ఆ బొండాన్ని మీగడతో తింటూ, బొండం తాగితే ఆ మాధుర్యం చెప్పనలవి కాదు.

శక్తినిచ్చే కొబ్బరి నీరు

తీవ్ర నిస్సత్తువతో బాధపడే వ్యక్తికి సిలైన్‌ను వైద్యులు నరం ద్వారా ఎక్కిస్తారు. ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా మంచి శక్తి నిచ్చే సిలైన్ కావాలంటే కొబ్బరి నీరు తాగాలసిందే. ఈ కొబ్బరి నీటిలో విటమిన్లు, ఖనిజ, లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఎటువంటి మలినాలు, సూక్ష్మ జీవులు లేని సహజ సిద్ధమైన స్టెరిలైజ్డ్ మినరల్స్ కలిగిన కొబ్బరి నీరు తక్షణ గ్లూకోజ్‌గా పనిచేసి శరీరానికి మంచి శక్తినిస్తుంది. వైద్యుల అభిప్రాయంలో మనిషి ఒక పూట తీసుకొనే ఆహారం ఎంత శక్తినిస్తోందో కొబ్బరి నీళ్లు అంత శక్తినిస్తాయని పేర్కొంటున్నారు.

కొబ్బరి నీళ్లలో ఉండే పోషకాలు

కొబ్బరి నీళ్లల్లో 90 శాతం పోషకాలు కలిగిన నీరు ఉంటుంది. శాస్త్రవేత్తలు, వైద్యుల లెక్క ప్రకారం 100 గ్రాముల నీళ్లలో 95.5 శాతం నీరు, కార్బోహైడ్రేట్లు 4.4 శాతం, ప్రొటీన్లు 0.01 శాతం, కొవ్వు 0.01 శాతం, నైట్రోజన్ 0.05 శాతం, ఫాస్ఫారిక్ ఆమ్లం 0.56 శాతం, పొటాషియం 290 మిల్లీగ్రాములు, కాల్షియం 4.4 మిల్లీగ్రాములు, సోడియం 4.4 మిల్లీగ్రాములు, మెగ్నీషియం 10 మిల్లీగ్రాములు, భాస్వరం 9.2 మిల్లీ గ్రాములు, ఐరన్ 106 మిల్లీ గ్రాములు, కాపర్ 26 మిల్లీ గ్రాములు ఉంటాయి. ఈ నీరు 17.4 శాతం శక్తిని కలిగిస్తుంది. ఒంటిని చల్లబరిచే గుణంతో పాటు జీర్ణక్రియ వ్యవస్థను బాగుపర్చే సత్తా కొబ్బరి నీళ్లకు ఉంటుందని పరిశోధనల్లో తేలింది. అన్ని రకాల విటమిన్లు సూక్ష్మ పోషకాలు కూడా బొండం నీళ్లలో ఉండటం వల్ల శరీరంలోని కణజాల వ్యవస్థ పనితీరు పెరుగుదలకు తోడ్పతాయి.

అలరించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం


వాడపల్లి క్షేత్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శన బాలలు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో శనివారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. ప్రతిరోజూ ముఖ్యంగా ప్రతి శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తుండగా మిగిలిన ఆరు రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. దీంతో ఈ క్షేత్రం నిత్య కల్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తుంది. 'ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం' నానుడితో అశేష భక్తజనం తరలిరావడంతో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందింది. ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు ప్రతిరోజు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. తిరుమలలో మాదిరిగా ఆలయ ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా శనివారం రాత్రి రాజమహేంద్రవరానికి చెందిన యజ్ఞశ్రీ నృత్యనికేతన్ వారితో శ్రీనివాస కల్యాణం కూచిపూడి నృత్య రూపకం భక్తులను విశేషంగా అలరించింది. సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరస్వామి భువికి దిగివచ్చారా.. అన్నట్టు, కల్యాణం కళ్లకు కట్టినట్టు బాలలు హావభావాలతో నృత్యం చేసి ఆకట్టుకున్నారు. భక్తుల ప్రశంసలు పొందారు. అలాగే వీణ, జానపదం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వెంకన్న కల్యాణోత్సవానికి ఏర్పాట్లు


అంబాజీపేటలో వెంకన్న ఆలయంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారి పాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిది శ్రీనివాసరావు తెలిపారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, యువత, స్థానిక భక్తులు ఆదివారం సమావేశమయ్యారు. చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది మే 7న స్వామి, దేవేరుల దివ్య కల్యాణం, 8న స్వామి వారి ఆలయ ప్రాంతంలో తీర్థం నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశామన్నారు. స్థానిక యువత సహకారంతో స్వామివారి కల్యాణం రోజున మిరిమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, తీర్థం రోజున స్వామివారిని దర్శించుకునే భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. అలాగే తీర్థం రోజున ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, ఉదయం నుంచి మ్యూజికల్ బ్యాండ్, రాత్రి సమయంలో గారడి, మ్యూజికల్ నైట్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశామని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యులు, మేడిది చిన్న, నైనాల ప్రభాకర్, మేడిది బుచ్చబ్బాయి, కుప్పాల సీతారామ్, వీరా సతీష్, పరసా సత్తిబాబు, నల్లా మాళి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు నాలుగు రోజులు ఆటంకం


పోతవరం వద్ద కొత్త పైపు లైన్లకు జాయింట్లు వేసి సిద్ధం చేయిస్తున్న అధికారులు

పి.గన్నవరం: పోతవరం వద్ద ఏజీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంచినీటి ప్రాజెక్టులకు వెళ్లే పైపు లైన్లను తొలగిస్తున్న నేపథ్యంలో మండలంలోని పి.గన్నవరం, ఎల్.గన్నవరం, యర్రంశెట్టివారి పాలెం గ్రామాలకు మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జె.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. పోతవరం వద్ద రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాజక్టుకు వెళ్లే పాత పైపు లైన్లను తొలగిస్తున్నారని ఆయన వివరించారు. అక్కడ రోడ్డును విస్తరించిన అనంతరం మార్జిన్‌లో గోతులు తవ్వి కొత్త పైపు లైన్లను ఏర్పాటు చేసి, తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు. కొత్త పైపులకు జాయింట్లు వేసి సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఏఈ కళ్యాణ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణ కుట్రలను తిప్పికొడతాం


సమావేశంలో సంఘీభావం ప్రకటించిన మాల జేఏసీ నాయకులు

మలికిపురం: ఎస్సీ వర్గీకరణ కుట్రలను తిప్పికొడతామని రాజోలు నియోజకవర్గ మాలల న్యాయపోరాట సమితి జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మలికిపురం పూలే-అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం రాజోలు నియోజకవర్గ మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ నాయకులు అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లుపై సుదీర్ఘ చర్చ జరపకుండా బిల్లును ఆమోదించడం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇవ్వడమేనన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. కార్యక్రమంలో మండల జేఏసీ కన్వీనర్లు తోటే రాజేష్, తాడి సహదేవుడు, నియోజకవర్గ జేఏసీ నాయకులు బత్తుల మురళీకృష్ణ, గెడ్డం ఫిలిప్‌రాజు, తోటే ప్రతాప్, గెడ్డం తులసీభాస్కర్, దేవ రాజేంద్ర ప్రసాద్, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన పెద్దింట్లమ్మ ఆలయం


మెండుపాలెంలో భక్తులకు తాగునీటి సరఫరా పర్యవేక్షిస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. నెల రోజుల ఉత్సవాల్లో ఆఖరి ఆదివారం సెలవు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వాహనాలలో అమ్మవారి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. సుమారు 25 వేల మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పర్యవేక్షణలో అంతర్వేది ఆలయ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది భక్తుల క్యూలైన్లు పర్యవేక్షించి, భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించారు. కాగా అమ్మవారి ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన అన్నదాన సంతర్పణలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు చేశారు. గ్రామానికి చెందిన యెనుముల బంగార్రాజు ఉచితంగా భక్తులకు ట్యాంకర్ ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. విశాఖపట్నంకు చెందిన దాత డి.సుందరరావు ఆలయానికి రూ.10 వేలు విరాళం అందజేశారు.

రాజోలు ఏఎంసీ శెట్టిబలిజలకే ఇవ్వాలి

మలికిపురం: రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అనాదిగా కొనసాగుతున్న ఆనవాయితీ మేరకు శెట్టిబలిజలకే ఇవ్వాలని కోరుతూ రాజోలు తాలూకా శెట్టి బలిజ సంఘం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. సుమారు 50 ఏళ్ల నుంచి మార్కెట్ కమిటీ ఏర్పాటు జరిగినప్పటి నుంచి మాజీ మంత్రి రుద్రరాజు రామలింగరాజు, మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య, ఏవీ సూర్యనారాయణరాజు హయాం నుంచి కూడా రాజోలు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆనవాయితీగా శెట్టిబలిజలకే ఇస్తున్నారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రిజర్వేషన్లు అంటూ మార్చడం తగదని సంఘీయులు వినతిపత్రంలో పేర్కొన్నారు. తగిన విధంగా స్పందించి కూటమి ప్రభుత్వం శెట్టిబలిజలకు ఆనవాయితీగా వస్తున్న ఏకైక పదవిని ఇవ్వాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఓసీ మహిళకు రిజర్వు అయినా కూడా వైఎస్సార్ సీపీలో కాపులంతా కూడా శెట్టిబలిజలకే ఆ పదవి ఇచ్చారని సంఘీయులు గుర్తు చేశారు. సంఘ తాలూకా అధ్యక్షులు దొమ్మేటి ఉమ, నాయకులు గుబ్బల మనోహర్, చెల్లుబోయిన బుచ్చియ్య మాష్టారు, గుబ్బల శ్రీనివాస్ తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

విప్లవకారుల ఆశయాలను కొనసాగించాలి



ఆలమూరులో భగత్‌సింగ్ పాత్రపై వివరిస్తున్న నాయకులు

ఆలమూరు: స్వాతంత్య్ర సమరంలో అసువులు బాసిన అమరవీరులు సాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను కొనసాగిద్దామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతిజ్ఞ చేసింది. ఆలమూరులోని సమతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి జరిగింది. జిల్లా ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు వి.శామ్యూల్, కమ్యూనిస్టు నేత చిట్టూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర ఉద్యమంలో భగత్‌సింగ్ పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. వామపక్ష భావజాల లక్షణాలకు ఆకర్షితులై బ్రిటీష్ వారి అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. భగత్‌సింగ్ మరణించినా ఆయన ఆశయాలు మాత్రం అనునిత్యం సజీవంగానే ఉంటాయని పేర్కొన్నారు. బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారనే నెపంతో 1931 మార్చి 23న ఉరివేయబడ్డ విప్లవకారులకు ఏఐఎస్ఎఫ్, ప్రజా నాట్యమండలి నాయకులు ఘన నివాళులర్పించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం పి.గన్నవరంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నేలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా పెదకాపు, తోలేటి సుబ్బారావు, కె.కృష్ణ భగవాన్, తోలేటి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ శతకకర్త గౌరీమల్లిక్‌కు సత్కారం


గౌరీమల్లిక్‌ను సత్కరిస్తున్న ఆరామ ద్రావిడ సమాఖ్య

ఆలమూరు: మండలంలోని చింతలూరుకు చెందిన ప్రముఖ శతకకర్త కామవరపు మల్లికార్జునరావు (గౌరీమల్లిక్)కు ఆదివారం ఘన సత్కారం జరిగింది. ఆంధ్ర ఆరామ ద్రావిడ సంక్షేమ సంఘం తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాజమహేంద్రవరంలో ప్రత్యేక సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరీమల్లిక్‌ను ఆరామ ద్రావిడ సంఘ నిర్వాహకులు ఘనంగా సత్కరించించి మెమోంటో బహూకరించారు. ప్రస్తుతం ఆయన ఆలమూరు బొబ్బా జయశ్రీ జెడ్పీ బాలికల స్కూల్లో తెలుగు పండితుడిగా చేస్తున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మలికిపురం: దళిత హక్కుల పోరాట సమితి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆదివారం మలికిపురంలో జరిగిన ఆహ్వాన సంఘం సమావేశం జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

దళితులపై జరుగుతున్న దాడులు, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం, సంక్షేమ పథకాల పునరుద్ధరణ తదితర అంశాలపై చర్చించి ఈ మహాసభలలో భవిష్యత్ కార్యక్రమం రూపొందిస్తారని, ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు ప్రభాకర్ హాజరవుతారని ఆహ్వాన సంఘ అధ్యక్షుడు గెడ్డం తులసీ భాస్కరరావు తెలియజేశారు. అనంతరం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు.

కెనరా బ్యాంకు ఏర్పాటుకు సన్నాహాలు

సఖినేటిపల్లి: మండల కేంద్రంలో నూతనంగా కెనరా బ్యాంకు బ్రాంచి ఏర్పాటుకు సదరు శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు లక్కవరం కెనరా బ్యాంకు ఫౌండర్ రుద్రరాజు గోపాలకృష్ణంరాజు అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడుతూ, ఖాతాదారులకు సేవలకై మెయిన్ రోడ్డుకు చేర్చి ఏర్పాటు చేయబోయే బ్రాంచికి తగిన భవన వసతి కొరకు మొబైల్ నంబర్లు 8247024071, 8121251368 సంప్రదించాలని ఆయన కోరారు.

ఉమ్మడి జిల్లాకే తలమానికం 'దో మినార్లు'


కొత్తపేట మసీదును ఆనుకుని నిర్మించిన మినార్లు

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదు వద్ద రెండు మినార్లు కనువిందు చేస్తున్నాయి. గత రెండేళ్ల వరకూ అది సాధారణ మసీదు. నేడు ఆ మసీదు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకే తలమానికంగా నిలిచింది. సుమారు 150 ఏళ్ల క్రితం చిన్న షెడ్డులో ఏర్పడిన మసీదు మూడు తరాల ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. అప్పట్లో 70 ముస్లిం కుటుంబాలు ఉండేవి వారు ఆ మసీదులోనే ప్రార్థనలు చేసుకునేవారు. తదనంతరం చాలా వరకూ కుటుంబాలు ఉపాధి రీత్యా వివిధ ప్రాంతాలకు తరలిపోయారు. మిగిలిన కొద్ది మంది ఆ మసీదును కాపాడుకుంటూ వస్తున్నారని మసీదు ప్రెసిడెంట్ షేక్ ఖాజాబాబు తెలిపారు. తాజాగా నేడు అనేక మంది స్థానిక, స్థానికేతర ముస్లింల సహకారంతో అద్భుతమైన మసీదుగా ఆధునీకరించారు. దీనిలో ఒక హిందువు ఆర్థిక సహకారం కూడా ఉంది.

క్లుప్తంగా

వైభవంగా వీరభద్రస్వామి సంబరం


వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: పెదపట్నంలంకలో వీరభద్ర స్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మేళ తాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద పినిశెట్టి వినయ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సంబరంలో భాగంగా కళాకారులు చేసిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భారీ సంఖ్యలో భక్తులు సంబరంలో పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ గ్రామ సభలు

మలికిపురం: మండలంలోని ఇరుసుమండ, విశ్వేశ్వరాయపురం గ్రామాల్లో భూముల రీ సర్వేలో భాగంగా సోమవారం రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆదివారం తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు వైద్యమిత్రల శాంతియుత ఆందోళన

ఆలమూరు: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వైద్యమిత్రలందరూ గాంధేయ వాద పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేపడతామని మండల వైద్యమిత్రల సమాఖ్య తెలిపింది. ఆలమూరు సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యమిత్రలు నామాల రామకృష్ణ, రమణ మాట్లాడుతూ రాష్ట్ర వైద్యసేవ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు జి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి కె.దేవేంద్రనాయక్ పిలుపు మేరకు వైద్యమిత్రులందరూ నిరసన తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

హరినామ నగర సంకీర్తన


అంతర్వేదిలో హరినామ నగర సంకీర్తన చేస్తున్న భక్త బృందం

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులు హరినామ నగర సంకీర్తన చేశారు. హరేకృష్ణ హరేకృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే, హరే రామ, హరేరామ, రామ రామ హరే హరే అంటూ ఆలయం వద్ద నుంచి గ్రామ మాఢ వీధుల్లో సంకీర్తన చేశారు. గాడిమొగ ఏరియాకు చెందిన శ్రీరాధాకృష్ణ మందిర భక్త బృందంతో స్వామివారిని పల్లకీలో ఆశీనులు చేసి పుణ్యక్షేత్రంలో ఈ నగర సంకీర్తన గావించారు. క్షేత్రంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లేలా, భక్తుల్లో మరింత భక్తిభావం పెంపొందింప చేసే దిశగా ఈ నగర సంకీర్తన సాగింది. అంతర్వేది ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్త బృందంకు ఆలయంలో తగిన వసతులు కల్పించి, వారికి అభినందనలు తెలిపారు. అధిక సంఖ్యలో చిన్నారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు


వెంకటేశ్వరరావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఏసీ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులు సంసాని శ్రీనివాసరావు, ఇతర సభ్యులు ఉన్నారు. వీరికి ఆలయ ఈఓ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు


తొండవరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు మూర్తి

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు అన్నారు. తొండవరంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ దొరబాబు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం అమలాపురం రోహిణి ఆస్పత్రి వైద్యులు వీఎస్ఎస్ మూర్తి, ఆదర్శ ఆస్పత్రి వైద్యులు వీఎల్ఎన్ దీక్షితులు శ్రీనివాసు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలి


ఆహార భద్రత పోస్టర్ విడుదల చేస్తున్న కాకి లక్ష్మణ్, అధికారులు

మలికిపురం: ఆహార పదార్థాల్లో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాజోలు ఆహార తనిఖీ అధికారి కేశవ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీపై ఆదివారం స్థానిక దిండి రిసార్ట్‌లో వ్యాపారులకు ఆహార భద్రతపై శిక్షణా కార్యక్రమం జరిగింది. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కేశవ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఆహార వ్యాపారస్తులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆహార కల్తీ జరిగితే ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్క వ్యాపారీ శిక్షణ పొందాలని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ట్రెయినర్ కలకండ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ హోటల్ వ్యాపారులు ఆహార తయారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవి పాటించడం వలన ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించినట్లు అవుతుందని ఆహార సంబంధిత వ్యాధులు తలెత్తకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా ఫోస్టాక్ ఫీల్డ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్స్ ఆనంద్ కుమార్, కృష్ణారావు, కాకి లక్ష్మణరావు, గెడ్డం ఫిలిప్‌రాజు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ను పరామర్శించిన గొల్లపల్లి


లక్ష్మీబాయి భౌతికకాయానికి మాజీ మంత్రి గొల్లపల్లి నివాళి

మామిడికుదురు: మగటపల్లి ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత మట్టా గంగయ్య మాతృమూర్తి మట్టా లక్ష్మీబాయి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సంతాపం తెలిపారు. లక్ష్మీబాయి భౌతికదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఉప సర్పంచ్‌ను పరామర్శించి అతన్ని ఓదార్చారు. ఆయనతో పాటు పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, స్థానిక పార్టీ నేతలు వర్దనపు బుజ్జి, ఉండ్రు గణేష్, భూపతి చిన్ని, మట్టా ఏడుకొండలు, సూరిశెట్టి మోహనరావు తదితరులు ఉప సర్పంచ్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

శెట్టిబలిజల అభివృద్ధికి శ్రమించిన 'దొమ్మేటి'


కొత్తపేటలో దొమ్మేటికి నివాళులర్పిస్తున్న సుబ్రహ్మణ్యం తదితరులు

కొత్తపేట: శెట్టిబలిజ కులస్తుల అభివృద్ధికి నిరంతరం శ్రమించిన దొమ్మేటి వెంకటరెడ్డిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక బీసీ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శెట్టిబలిజ సంఘ స్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి చంటి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి రామకృష్ణ, మండల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గుబ్బల సత్తిపండు, ఖండ్రిగ, మోడేకుర్రు వీడీసీ కన్వీనర్లు దూనబోయిన శ్రీనివాస్, కుడుపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి కార్యక్రమాన్ని స్థానిక మూడు రోడ్ల సెంటర్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చొల్లంగి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, దొమ్మేటి వెంకట శివరామన్, వాసంశెట్టి కుమార్, యాండ్ర శ్రీనివాస్, మట్టపర్తి రామకృష్ణ, పితాని రాంబాబు, గుత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.